క్లుప్తంగా

కోడ్ కొండెక్కింది..


వాడపాలెంలో జనసేన నేతల ఫ్లెక్సీ

కొత్తపేట: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులో ఉన్నా కూటమి నాయకుల ఫ్లెక్సీలు ఎక్కడికక్కడే దర్శనమిస్తున్నాయి. ఈ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఎలక్షన్ కమిషన్ గత నెల 29న షెడ్యూల్ విడుదల చేయగా, ఆ రోజు నుంచే కోడ్ అమలులోకి వచ్చింది. వెంటనే రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు తొలగించాల్సి ఉంది. కానీ అధికారులు మొక్కుబడిగా చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గ కేంద్రం కొత్తపేట మండలంలో పలుచోట్ల కూటమి పాలకులు, నాయకుల ఫొటోలతో పబ్లిసిటీ ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. దానితో కోడ్ అమలులో ఉందా? లేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థుల ఔదార్యం


స్నేహ ఫౌండేషన్ ప్రతినిధికి నగదు అందిస్తున్న స్కూల్ ప్రిన్సిపల్ యేలూరి

సఖినేటిపల్లి: మోరిపోడు రివర్‌సైడ్ స్కూల్ విద్యార్థులు సేకరించిన నగదును విజయవాడ కేంద్రంగా ఉన్న స్నేహ ఫౌండేషన్ అంధుల ఆశ్రమానికి శుక్రవారం స్కూల్ వద్ద జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులకు అందజేశారు. ఈ మేరకు వారంతా రూ.1,42,110 సేకరించగా, విద్యార్థుల తరఫున స్కూల్ ప్రిన్సిపల్ యేలూరి కిశోర్‌బాబు, స్కూల్ స్టాఫ్ కలిపి ఫౌండేషన్ ప్రతినిధికి అందజేశారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మామిడికుదురు: శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వ్యాస్కులర్ వ్యాధుల వైద్య శిబిరం ఏర్పాటు చేశామని జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు అడబాల కొండబాబు శుక్రవారం తెలిపారు. మొగలికుదురులోని జగ్గన్నపేట శ్రీసత్యసాయి కల్యాణ మంటపంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకూ ఈ శిబిరం జరుగుతుందన్నారు. ఇందులో రూ.4,500 విలువ చేసే కలర్ డాప్లర్ ఆల్ట్రా సౌండ్ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొండబాబు కోరారు.

బీజేపీ కార్యాలయానికి స్థల విరాళం

మలికిపురం: రాజోలు నియోజకవర్గ బీజేపీ కార్యాలయ నిర్మాణానికి ఆ పార్టీ జిల్లా నాయకుడు, ఎఫ్‌సీఐ మెంబర్ దొండ్డా నాగబాబు మలికిపురంలో రెండు సెంట్ల భూమిని విరాళంగా ఇచ్చారు. సంబంధిత భూమిని పార్టీకి స్వాధీన పరుస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా మాట్లాడుతూ మలికిపురం రెవెన్యూ కార్యాలయ సమీపంలో విలువైన భూమిని పార్టీకి ఇవ్వడం పట్ల నాగబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, మండల పార్టీ అధ్యక్షుడు మేడిచర్ల చాణక్య, లక్కవరం నీటి సంఘం ఉపాధ్యక్షుడు కాపిశెట్టి కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాశర్లపూడిబాడవ స్కూల్‌లోనే విలీనం చేయాలి

మామిడికుదురు: పాశర్లపూడిబాడవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను పూర్వం మాదిరిగా స్థానిక ప్రాథమిక పాఠశాలలోనే విలీనం చేయాలని ప్రజలు కోరారు. దీనిపై శుక్రవారం ఎంఈఓ ఎస్.లక్ష్మీనారాయణకు వినతిపత్రం ఇచ్చారు. ఇక్కడ పిల్లలను తీసుకు వెళ్లి మెయిన్ స్కూల్‌లో కలపాలన్న ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. అక్కడకు జాతీయ రహదారి మీదుగా వెళ్లడంతో పాటు బ్రాందీ షాపు దాటి వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. దీనివల్ల చిన్నారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పునరాలోచన చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్ఎంసీ చైర్మన్ తోరం నాగరాజు, వేగి లక్ష్మీనారాయణ, నానాజీ ఉన్నారు.

వైభవంగా చండీ హోమం

రావులపాలెం: స్థానిక భద్రమహంకాళ్లమ్మ పుంతలో పెద్దింట్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం చండీ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు.

యువకుడి అదృశ్యం

పి.గన్నవరం: ఓ యువకుడు అదృశ్యమైన ఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. మానేపల్లికి చెందిన చింతా ఏసురత్నం తల్లిదండ్రులు గతంలో మరణించారు. గత కొంత కాలంగా ఏసురత్నం మానసిక వ్యాధితో బాధ పడుతున్నాడు. ఈ నెల 12న ఇంటి నుంచి వెళ్లిన ఏసురత్నం తిరిగి రాలేదు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ప్రతి రైతుకూ గుర్తింపు సంఖ్య


పుల్లేటికుర్రులో రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏఓ బోసుబాబు

- నకిలీ రైతులు, బినామీలకు అడ్డుకట్ట
- నెలాఖరుకు ప్రక్రియ పూర్తికి చర్యలు

అంబాజీపేట: సంక్షేమ పథకాలు అర్హులకు అందించి, నకిలీలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి రైతుకు 11 అంకెల విశిష్ట సంఖ్యను జారీ చేయనున్నాయి. నేరుగా లబ్ధి చేకూర్చేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో రైతుల వివరాలను అన్ని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేస్తున్నారు. తర్వాత కౌలు రైతులకు కూడా ఈ తరహా నంబర్ జారీ చేయనున్నారు. 11 నెలల కాల పరిమితితో ఈ నంబర్ కేటాయిస్తారని అధికారులు చెబుతున్నారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో ప్రతి రైతు వ్యక్తిగత భూ వివరాలు నమోదు చేసి, ఆధార్ సంఖ్య తరహాలో ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తున్నారు. ఈ సంఖ్య ద్వారా అవసరమైన సమయాల్లో అర్హులైన రైతులను అధికారులు గుర్తిస్తారు. వారికి పంటల బీమా, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ పరికరాలపై రాయితీలు, పంట నష్ట పరిహారం తదితరాలు అందజేస్తారు. సాగునీటి సంఘాల సమస్యలు, పంటల తెగుళ్లు, ఇతర వ్యవసాయ సలహాలు సైతం అధికారుల నుంచి నేరుగా పొందేందుకు అవకాశం ఉంటుంది. పి.గన్నవరం నియోజకవర్గంలో సుమారు 25 వేలు, రాజోలు నియోజకవర్గంలో 18 వేలు, కొత్తపేట నియోజకవర్గంలో 40 వేల మంది రైతులు, కౌలు రైతులు ఉన్నారు.

మొరాయిస్తున్న సర్వర్లు

ఒకేసారి అన్ని రైతు సేవా కేంద్రాల్లో విశిష్ట సంఖ్య కోసం నమోదు చేస్తుండడంతో సర్వర్లు మొరాయిస్తున్నాయి. ఆన్‌లైన్ ప్రక్రియలో భాగంగా రైతులకు ఓటీపీలు కూడా రావడం లేదు. రైతులు ఆర్ఎస్‌కేల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు అర్హుడే. రైతు ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ అనుసంధానమై ఉండాలి. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ తీసుకుని రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలి. ఈ ఆధారాలతో రైతు వివరాలను కంప్యూటర్లో నమోదు చేస్తారు. నమోదు పూర్తి కాగానే రైతు సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఆ నంబర్ ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తే నమోదు ప్రక్రియ పూర్తవుతుంది. అయితే కొందరు రైతుల ఫోన్ నంబర్లు ఆధార్‌కు అనుసంధానం కాకపోవడంతో నమోదు ప్రక్రియకు అంతరాయం ఏర్పడుతుంది. ఇక్కడ వరి పొలాలు ఉండి ఇతర రాష్ట్రాల్లో ఉండే రైతులు తమ ఆధార్‌కు ఫోన్ నంబర్ లింకు చేయించుకోకపోవడం, సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న రైతుల నమోదు ప్రక్రియకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

చురుగ్గా ప్రక్రియ



ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇస్తారు. ఈ నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. అన్ని మండలాల్లో 5 వేలకు పైగా ఉన్న రైతులకు ఈ విశిష్ట సంఖ్య ఇస్తాం. రైతుల ఆధార్ కార్డు, పాస్‌పుస్తకం జిరాక్స్, ఆధార్‌కు లింకైన ఫోన్ నంబర్‌తో రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలి. ఈ నమోదు క్రమంలో మూడు సార్లు ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెలాఖరు నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేస్తాం.

– వి.బోసుబాబు, డీఏఓ, అమలాపురం

మాజీ సీఎం జగన్‌ను కలసిన ఎంపీపీ మార్గన


మాజీ సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీపీ గంగాధరరావు, మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎంపీపీ మార్గన గంగాధర్‌రావు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చిర్ల జగ్గిరెడ్డితో ఎంపీపీ గంగాధరరావు కలసి వెళ్లి జగన్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పరిస్థితులు, పార్టీ అభివృద్ధి అంశాలను జగ్గిరెడ్డి, గంగాధరరావు జగన్ దృష్టికి తీసుకెళ్లారు.

అధినేత జగన్‌తో వర్మ


మాజీ సీఎం జగన్‌ని కలసిన వర్మ

రాజోలు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు స్టూడియో వర్మ తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శివకోడు గ్రామానికి చెందిన వర్మకు వైఎస్సార్ కుటుంబం అంటే ఎంతో అభిమానం. జగన్‌మోహన్‌రెడ్డి రాజో లు నియోజకవర్గం పర్యటనకు వచ్చిన సమయంలో తన కుమారుడికి రాజశేఖరరెడ్డి అని నామకరణం చేశారన్నారు. ఇప్పుడు ఆయనను కలిసినప్పుడు తన కుమారుడి యోగక్షేమాలు అడగడం ఎంతో ఆనందం కలిగించిందన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వర్మ తెలిపారు.

ఘనంగా జమానా అవతరణ దినోత్సవం


నగరంలో ఓడ ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం, చివరి ప్రవక్త ఇమామే జమానా అవతరణ దినోత్సవాన్ని నగరంలో శుక్రవారం ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. కల్కి భగవానునిగా జమానాను ముస్లింలు నిండు మనసుతో ఆరాధిస్తారు. ఇందులో భాగంగా హుజ్జతీయ భవనం నుంచి జమానా వాహనమైన 'ఓడ'ను తీసి ఊరేగించారు. పూర్వీకుల ఆత్మశాంతి కోరుతూ వారి సమాధుల వద్ద గురువారం రాత్రి ప్రార్థనలు చేసి, బాణసంచా కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. మామిడికుదురులోని బాషు పంజాలో మిలాద్ జరిగింది. పలువురు ఉర్దూ కవులు తమ కవిత్వాల ద్వారా ఇమామే జమానా మహిమలను వివరించారు. హుజ్జతీయ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించిన అనంతరం ఓడను నగరం పీర్ల చెరువులో వదిలి పెట్టారు. ఈ సందర్భంగా మామిడికుదురులోని బార్గాహే ఖమరే బనీ హాసిమ్ పంజాలో భక్తులకు ప్రసాదాలను పంచారు.

పరిసరాల శుభ్రతతోనే దోమల నివారణ


నాగాబత్తులవారిపాలెంలో దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఓ అప్పారావు

అంబాజీపేట: దోమలను అరికట్టేందుకు మన చుట్టూ ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ సీహెచ్ఓ బి.అప్పారావు అన్నారు. మాచవరం నాగాబత్తులవారిపాలెంలో డ్రైడే- ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా దోమల నివారణపై స్థానికులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఇంటి వద్ద ఉన్న మురుగు నీటి కాలువలు, బోదెలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో చెత్తాచెదారాన్ని నివాస ప్రాంతాల వద్ద ఉంచరాదన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యకు కృషి

మలికిపురం: కేశనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వై.లక్ష్మణరావు నియమితులయ్యారు. ఈ మేరకు విద్యా శాఖ రీజినల్ డైరెక్టర్ శారదాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రెండు పర్యాయాలు ఆయన ఇదే కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ విద్య అందించేందుకు కృషి చేస్తానన్నారు.

ఆకట్టుకున్న పెయ్య దూడల ప్రదర్శన


పెయ్య దూడలను ప్రదర్శిస్తున్న రైతులు

అలమూరు: ప్రభుత్వం అందిస్తున్న కృత్రిమ పెయ్య దూడల ఉత్పత్తి పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ ఎల్.అనిత అన్నారు. నవాబుపేటలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కృత్రిమ మేలు జాతి ఆరు నెలల లోపు దూడల అందాల ప్రదర్శన జరిగింది. దీనికి డీఎల్‌డీఏ వైద్యాధికారి కళ్యాణి హాజరై ప్రసంగించారు. ఆరోగ్యవంతమైన దూడల పెంపకం ద్వారా అధిక పాలనిచ్చే పాడి పశువులను పొందవచ్చని ఆమె సూచించారు. నట్టల నివారణ మందులు, కాల్షియం, లివర్ టానిక్స్, పాల క్యాన్‌లను అందజేశారు. ఆరు నెలల లోపు దూడల ప్రదర్శనలో ఎంపికైన మూడింటికి బహుమతులు ఇచ్చారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ జి.భాను ప్రసాద్‌రావు, న్యాయనిర్ణేతలుగా వీవీ రమణమూర్తి, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

సంజీవయ్య అందరికీ ఆదర్శం


మోరిలో సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బుజ్జిరాజు, టాండన్‌రాజు

సఖినేటిపల్లి: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అందరికీ ఆదర్శనీయుడని రాజోలు తాలూకా సమిష్టి వ్యవసాయ సహకార సంఘాల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు ఓగూరి టాండన్ రాజు అన్నారు. శుక్రవారం మోరిలో మహిమ కోకోనట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయం వద్ద సంజీవయ్య జయంతిని నిర్వహించారు. రాజోలు తాలూకా సమిష్టి వ్యవసాయ సహకార సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సంజీవయ్య చిత్రపటం వద్ద వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జంపన బుజ్జిరాజు, టాండన్‌రాజు పూలమాలలు వేశారు. అనంతరం సమాఖ్య అధ్యక్షుడు గెడ్డం ప్రభాకరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. మార్టిన్ మాస్టార్, తోటె ప్రతాప్, చింతా శేషు, తోటె జాన్‌బాబు, నానాజీ, రాజారత్నం, తాడి సహదేవ్, నల్లి శివకుమార్, బూశి జాన్‌మోసే, తాడి శివాజీ తదితరులు పాల్గొన్నారు. అలాగే సఖినేటిపల్లి సంజీవయ్య కాలనీలో మాజీ ముఖ్యమంత్రి సంజీవయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. కాలనీ సంఘ అధ్యక్షుడు కె.రాజీవ్ భూషణ్, జె.కుమార రత్నం, పి.రాజ్‌కుమార్, డి.రాజ్‌కుమార్, డి.బాబూరావు, సుశీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వాహనాలు నడపొద్దు


సదస్సులో మాట్లాడుతున్న ఎంవీఐ శ్రీనివాసరావు

మలికిపురం: నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని రావులపాలెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మలికిపురం ఎంవీఎస్‌జేఎస్ అండ్ ఆర్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో 36వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా రోడ్డు భద్రతా నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీనికి ప్రిన్సిపల్ ఎస్.ఆనందమహాని అధ్యక్షత వహించారు. రిసోర్స్ పర్సన్‌గా రావులపాలెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడాలని, కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, మద్యం తాగా వాహనాలు నడపరాదని అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సఖినేటిపల్లి ఎస్సై కె.శ్రీనివాస్, మలికిపురం ఏఎస్ఐ టి.నరసింహారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు నక్క రమేష్‌బాబు, టి.ఆంజనేయులు, ఆర్ఆర్‌కే రాజు, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలతో స్థిరమైన ఆదాయం


కేదార్లంకలో ఉత్తమ రైతులను సత్కరిస్తున్న హెచ్ఓ కోటేశ్వరరావు, కంపెనీ ప్రతినిధులు

కొత్తపేట: స్థిరమైన ఆదాయం అందించే ఆయిల్ పామ్, అంతర పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని కొత్తపేట ప్రాంతీయ ఉద్యాన అధికారి (హెచ్ఓ) జి.కోటేశ్వరరావు సూచించారు. కపిలేశ్వరపురం మండలం కేదార్లంక గ్రామంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఉద్యాన శాఖ, సర్వే సాయి ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఓ కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో కంపెనీ జీఎం కేజే ప్రభాకర్‌రావు, ఏజీఎం పి.వీరభద్రరావు పాల్గొన్నారు. హెచ్ఓ కోటేశ్వరరావు మాట్లాడుతూ నూనె గింజల ఉత్పత్తికి దేశంలో అధిక డిమాండ్ ఉండడంతో పాటు మార్కెటింగ్ సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. 30, 35 సంవత్సరాల పాటు రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందన్నారు. దేశ ప్రజల అవసరాలకు రెండున్నర లక్షల టన్నుల ఆయిల్ ఉత్పత్తి జరగాల్సి ఉండగా, 40 శాతం మాత్రమే ఉత్పత్తి చేయగలుగుతున్నామన్నారు. మిగతాదంతా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఉద్యాన శాఖ ఎరువులు, అంతర పంటకు సబ్సిడీ అందించడంతో పాటు, ఎన్ఆర్ఈజీఎస్, ఉద్యాన శాఖ అనుసంధానంగా ఉన్న పథకాలను సైతం రైతులు వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు, ప్రోత్సాహకాలను వివరించారు. కంపెనీ జీఎం ప్రభాకరరావు మాట్లాడుతూ ప్లాంటేషన్, మార్కెటింగ్ తదితర అంశాల్లో కంపెనీ సహకారం రైతులకు పూర్తిగా లభిస్తుందన్నారు. అనంతరం ఆయిల్‌పామ్ అధిక దిగుబడిని తీస్తున్న ఉత్తమ రైతులు బద్ద సల్మాన్ రాజు, గనిశెట్టి బ్రహ్మారాంబలను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు, వీహెచ్ఏలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ఎంవీఐ శ్రీనివాస్

రాజోలు: రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రాణాలకు రక్షణ కలుగుతుందని రావులపాలెం, రాజోలు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, షణ్ముఖశ్రీనివాస్‌లు అన్నారు. శుక్రవారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలు, వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా అతివేగంతో ఎక్కువ సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలాగే మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. విద్యార్థులకు రోడ్డు భద్రతా, వాహన నియమాలపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అలాగే తాటిపాక సెంటరులోని పంచాయతీ కాంప్లెక్స్ వద్ద ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. రాజోలు సీఐ నరేష్‌కుమార్, ఎస్సై రాజేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, అధ్యాపకులు దయాసాగర్, పీఆర్వో నల్లి రాజు, రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

అంబాజీపేట: ముక్కామల నాలుగు రోడ్ల కూడలిలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టనున్నట్లు అమలాపురం ఆర్అండ్‌బీ ఏఈ రమేష్ తెలిపారు. కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సూచనల మేరకు ప్రమాద ప్రాంతాలను గుర్తించి వాటి నివారణకు ఆర్అండ్‌బీ శాఖ ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక సెంటర్‌లో ప్రతి రోజూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న తీరుపై జిల్లా మౌలిక వసతుల సాధన కమిటీ కన్వీనర్, సామాజిక కార్యకర్త ఎన్ఎస్ఎన్ వర్మ కూడా ఫిర్యాదు చేయడంపై ఇక్కడ చర్యలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య


రామరాజులంకలో రైతులను నమోదు చేస్తున్న సిబ్బంది

మలికిపురం: రైతులకు కేంద్ర ప్రభుత్వం విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించే కార్యక్రమం వేగంగా జరుగుతుందని మండల వ్యవసాయాధికారి ఎస్.రాకేశ్ తెలిపారు. పలు గ్రామాల్లో శుక్రవారం జరిగిన నమోదు గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు. మండలంలో మొత్తం 8 వేల పీఎం కిసాన్ రైతులు ఉన్నారన్నారు. ఇప్పటికి 2 వేల మంది రైతులకు రిజిస్ట్రేషన్ పూర్తయిందన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక


ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన ఈతకోట హైస్కూల్ విద్యార్థులు

రావులపాలెం: ఈ ఏడాది జరిగిన ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ఈతకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన లంకె దినేష్, అడగళ్ల బిందులక్ష్మీ ప్రియ, షేక్ ఆయేషా, కోసూరి సుగుణ, సీహెచ్ లక్ష్మీప్రియ, వల్లపురెడ్డి దీపిక, ఏపుగంటి సంజన ప్రతిభ చాటారు. వీరు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించినట్లు హెచ్ఎం కేఎస్‌వీ కృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ పిప్పర రమేష్, వైస్ చైర్మన్ నాగమణి, సర్పంచ్ వై.సుబ్బలక్ష్మి, ఉప సర్పంచ్ వై.నాగార్జున తదితరులు అభినందించారు.


ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన మామిడికుదురు విద్యార్థులు

మామిడికుదురు: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షల్లో మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ చాటారు. మెరిట్ స్కాలర్ షిప్‌కు అర్హత సాధించారని హెచ్ఎం సీహెచ్ నిరంజని శుక్రవారం తెలిపారు. చిట్టా పృథ్వీరాజ్, దుర్రే షహవర్, మహ్మద్ సాజిత్ అబ్బాస్, కొనుకు సిరివెన్నెల స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారని చెప్పారు. వీరికి 8 నుంచి 12వ తరగతి వరకూ నెలకు రూ.వెయ్యి చొప్పున ఏడాదికి రూ.12 వేల ఉపకార వేతనం చెల్లిస్తారన్నారు. మగటపల్లి స్కూల్‌కు చెందిన కడలి వైష్ణవి కూడా స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారు.

పాస్టర్స్ ఫెలోషిప్ సహవాస కూడిక

సఖినేటిపల్లి: స్థానిక పెదకొడపలో యునైటెడ్ ఎవాంజికల్ చర్చి వద్ద శుక్రవారం యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సహవాస కూడిక జరిగింది. దీనిని ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ దేవ సాల్మన్‌రాజు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ కూడికలో ఫెలోషిప్ మీడియా కోఆర్డినేటర్‌గా విశిష్ట సేవలందిస్తున్న కమిటీ సభ్యుడు డాక్టర్ పాలపర్తి శేఖర్‌బాబును చర్చి నిర్వాహకులు సత్కరించారు. రెవరెండ్ దేవ ప్రవీణ్, డి.సాల్మన్‌రాజు, పాస్టర్ టి.చిట్టిబాబు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్యానికి చర్యలు


చింతలూరులో చెత్త తరలింపును పరిశీలిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం నెలకొల్పేందుకు డ్రై డే ఫ్రై డే నిర్వహిస్తున్నట్లు చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, ఆర్.మల్లిఖార్జున్, డి.సాయికిషోర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలు ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి కీటకాలు దరిచేరవని, తద్వారా అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించి ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ.రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్య సేవలను పర్యవేక్షించారు.

స్నానాల రేవు.. ఇబ్బందులు పట్టవు


స్నానాల రేవు మెట్లపై ఖాళీ బ్రాందీ సీసాలు, చనిపోయిన కోడి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి స్నానాల రేవులో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఈ రేవులో శుక్రవారం స్నానం చేసేందుకు వెళ్లగా మెట్లపై ఖాళీ బ్రాందీ సీసాలు, చనిపోయిన కోడి పడి ఉందని పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన భక్తుడు, అడ్వకేట్ పి.సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇటువంటి సంఘటనలు భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తాయన్నారు. దీనిపై ఆలయ అధికారులు తక్షణం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజును వివరణ కోరగా శుభ్రం చేయిస్తామన్నారు.